క్లుప్తంగా

టెన్త్ టాపర్ల తల్లిదండ్రులకు సన్మానం



విద్యారణ్యపురి: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థినుల తల్లిదండ్రులకు హైస్కూల్ హెచ్‌ఎం ఉమ, ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. విద్యార్థినులు కావ్యశ్రీ (564 మార్కులు), చందన (557), అనుషబేగం (537) తోపాటు 500లకుపైగా మార్కులు సాధించిన 17మంది విద్యార్థినుల తల్లిదండ్రులను అభినందించారు. 55మంది విద్యార్థినులకు గాను 54 మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ఉషారాణి, ఉపాధ్యాయులు రాములు, పద్మ, సుజాత, విమల, శ్రీదేవి, శోభ, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వే ఏడీఎంఈకి అభినందన



కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో ఏడీఎంఈగా పనిచేస్తూ తిరుపతి రైల్వే వర్క్ షాప్ మేనేజర్‌గా బదిలీపై వెళ్తున్న భానుప్రకాష్‌ను రైల్వే నాయకులు, కార్మికులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు జానీవిఎయా, గిరిమిట్ల రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ డీజిల్‌షెడ్ విధి నిర్వహణలో ఏడీఎంఈగా భానుప్రకాష్ 3 ఏళ్లపాటు పనిచేసి అధికారులు, కార్మికుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు.

చంద్ర ఆశయాలు కొనసాగించాలి

న్యూశాయంపేట: దేశ స్వాతంత్య్ర పోరాటంలో క్రమశిక్షణ సమసమాజ స్థాపన కోసం నిరంతరం పరితపించిన చంద్ర రాజేశ్వరావు ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. పార్టీ హనుమకొండ కార్యాలయంలో రాజేశ్వర్‌రావు 111వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆదిరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేశ్, మునిగాల భిక్షపతి, బత్తిని సదానందం, జక్కు రాజు, వెంకట్రాజం, శ్రీనివాస్, సారంగపాణి, శంకర్‌నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామంలో మూడు రోజుల పాటు కొనసాగిన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం ఉదయం 7.52 గంటలకు బొడ్రాయిని పునఃప్రతిష్ఠించారు. హోమం, కుంకుమపూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం బోనాల ప్రదర్శన సాగింది. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో శాంతిని నెలకొల్పాలి

విద్యారణ్యపురి: మావోయిస్టులు ఆయుధాలు వదలి, సమాజంలో శాంతిని నెలకొల్పాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండలో నయీంనగర్ నుంచి కేయూ క్రాస్ రోడ్డు వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలు ఇంకా అభివృద్ధి చెందకపోవడానికి వారే కారణమన్నారు. మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని సూచించారు. ర్యాలీలో ఏబీవీపీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆరెపల్లి సుజిత్, సిటీ సెక్రటరీ అరుణ్, హరిచరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

61 ఏళ్ల వయస్సులో లా సెట్



హన్మకొండ: చదువుకోవాలని కోరిక ఉంటే కాదేది అడ్డంకి అనే సూక్తి విశ్రాంత విద్యుత్ ఉద్యోగికి వర్తిస్తుంది. టీజీ ఎన్పీడీసీఎల్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా రిటైరైన నార్ల సుబ్రమణ్యేశ్వర్ రావు 61 ఏళ్ల వయస్సులో న్యాయ శాస్త్రం చదివేందుకు సిద్ధమయ్యారు. మే 31న పదవీ విరమణ పొందిన హనుమకొండ ప్రకాశ్ రెడ్డి పేటకు చెందిన నార్ల సుబ్రమణ్యేశ్వర్ రావు శుక్రవారం జరిగిన ఎల్ఎల్‌బీ ప్రవేశ పరీక్ష లాసెట్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలకరించగా తనకు చిన్న నాటి నుంచి ఎల్ఎల్‌బీ చదువాలని కోరిక ఉందన్నారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుండడంతో లా చదవడం వీలు కాలేదన్నారు. రిటైర్ అయినందున విశ్రాంత జీవితంలో ఎల్ఎల్‌బీ చేయాలనే పట్టుదలతో లాసెట్‌కు హాజరయ్యానని తెలిపారు.

బుద్ధభవన్ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- దశాబ్దకాలంగా నిలిచిన పనులు
- ఎమ్మెల్యే నాయిని చొరవతో అడుగులు
- ఒత్తిళ్లకు తలొగ్గకుండా పూర్తయ్యేనా..?

హన్మకొండ చౌరస్తా: రాజకీయ నాయకుల అలసత్వం, నిధుల కొరత లాంటి అనేక కారణాలతో నిలిచిన బుద్ధభవన్ రోడ్డు విస్తరణ పనులు ఈ సారైనా జరిగేనా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. సుమారు దశాబ్దకాలం క్రితం ప్రారంభమైన విస్తరణ పనులకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఏడాది లోపే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో బుద్ధభవన్ రోడ్డు విస్తరణకు తొలి అడుగులు పడ్డాయని స్థానికులు సంబురపడ్డారు. అయితే, ప్రస్తుతం అనేక ఒత్తిళ్లకు తలొగ్గకుండా, అడ్డంకులను అధికమించి, ప్రణాళిక ప్రకారం రోడ్డును అభివృద్ధి చేస్తారా, గత ప్రభుత్వం మాదిరిగానే అలా ప్రారంభించి ఇలా వదిలేస్తారా అన్న అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు ప్రకటనలకే పరిమితం

హనుమకొండలోని కాంగ్రెస్ భవన్ నుంచి కేయూ బైపాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు వేసేందుకు పదేళ్ల క్రితం సీఎం నిధుల నుంచి దాదాపు రూ.2 కోట్లను కేటాయించినట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, రాజకీయ గ్రహణం, నిధులు విడుదల చేయకపోవడంతో విస్తరణ ప్రతిపాదనలు ప్రకటనలకే పరిమితమయ్యాయి.



రోడ్డు విస్తరణకు నోచుకోని బుద్ధభవన్ రోడ్డు

40 ఫీట్ల రోడ్డుకు గ్రీన్ సిగ్నల్

నగరం అభివృద్ధి చెందుతున్న వేళ రోజురోజుకు ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రోడ్డు విస్తరణ తప్పనిసరి. ఇటీవల జరిగిన వరంగల్ మహానగర మాస్టర్ ప్లాన్‌పై నిర్వహించిన సమీక్షలో ప్రణాళికలు సైతం రూపొందించినట్లు తెలుస్తోంది. కుడా ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో కాంగ్రెస్ భవన్ నుంచి బుద్ధభవన్ మీదుగా కేయూ బైపాస్ రోడ్డుకు చేరుకునేలా 40 ఫీట్ల రోడ్డు వేసేందుకు అధికారులు రూపొందించిన విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ పడినట్లుగా వెల్లడించారు.

పూర్తయిన కల్వర్టుల పనులు

బుద్ధభవన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కాంగ్రెస్ భవన్ నుంచి బుద్ధభవన్‌కు వెళ్లే దారిలో ఏ వన్ మటన్‌షాప్ వద్ద రెండు వైపులా కల్వర్టుల నిర్మాణం నెల క్రితం ప్రారంభించగా, ఇటీవల ఆ పనులు పూర్తయ్యాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగానే కల్వర్టులు నిర్మించారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు వెడల్పు చేయాలి



దాదాపు పదిహేను ఏళ్లుగా బుద్ధభవన్ రోడ్డును వెడల్పు చేస్తామని నాయకులు అంటున్నారు. కానీ తట్టెడు మట్టి తీసింది లేదు. నగరం ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఈ రోడ్డును మాత్రం ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కాంగ్రెస్ భవన్ నుంచి కేయూ బైపాస్ రోడ్డు వరకు విస్తరణ చేయాలి.

– ముద్దమల్ల వెంకట్రావు, బుద్ధభవన్

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు



కాంగ్రెస్ భవన్ నుంచి బుద్ధభవన్ మీదుగా కేయూ రోడ్డుకు చేరాలంటే కనీసం అరగంట సమయం పడుతుంది. ఇరుకైన రోడ్లకు తోడు గుంతలుపడిన దారిల్లో రాత్రి వేళల్లో ముఖ్యంగా వర్షాకాలం వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రభుత్వం అడ్డంకులను ఎదుర్కొని రోడ్డు విస్తరణ చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేసినట్లవుతుంది. ఈ విషయంలో ఎమ్మెల్యే నాయిని పట్టుదలతో పనిచేస్తారన్న నమ్మకం ఉంది.

– జానీలేవీ బండారు, వాహనదారుడు

కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

ఖిలా వరంగల్: పేదల కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు తెలిపారు. వరంగల్ 42వ డివిజన్ లెనిన్‌నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్‌కు స్థానిక కార్పొరేటర్ గుండు చందనతో కలిసి మేయర్ సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ మురళి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు త్వరలోనే ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో 42వ డివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, ఎలుగం సాంబేశం, చింతపట్ల కమలాకర్, గుంటి కుమార్, మజ్జిగ తిరుమల్, కత్తెరశాల వేణుగోపాల్, బత్తిని వసుంధర, మీసాల ప్రకాశ్, సిద్దం రాము, పోశాల మల్లికార్జున్, పాలకుర్తి సుమన్‌గౌడ్, శంకేసి అనిల్, ఆవునూరి కుమార్, విలాసాగరం శ్రీనివాస్, ప్రవీణ్, చంద్రమౌళి, వేణు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సుధారాణి, మురళి

సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న జక్కుల వెంకటయ్య

హన్మకొండ: రాష్ట్రవ్యాప్తంగా భూపోరాటాల ద్వారా సాగు భూమిని సాధించుకుని పంటల సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రైతాంగ పోరాటాల ఫలితంగా భూమిలేని రైతులు బంజేరు భూములు, దొరలు, భూస్వాముల నుంచి భూములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత 50 ఏళ్లుగా ఆ భూములు దున్నుకొని సాగు చేసుకుంటున్నా.. నేటి వరకు పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని భూభారతి ద్వారా పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉన్నారని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందక రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం వరి, పత్తితో పాటు అన్ని రకాల నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని, రైతు భరోసా నిధులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తూరు ఇంద్రసేన, జిల్లా నాయకుడు కర్రె ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తివేయాలని సంతకాల సేకరణ

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్యలో ఉన్న డంపింగ్ యార్డును ఎత్తివేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని, భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డ్‌ను అక్కడి నుంచి తరలించాలని కొద్ది నెలలుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు చొరవ తీసుకుని డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి, మండల కార్యదర్శి మాలోతు శంకర్, వేల్పుల సారంగపాణి, రాజారాం, పూర్ణచందర్ పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

భూసమస్యల పరిష్కారానికి సదస్సులు



మడికొండ: భూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది



హసన్‌పర్తి: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మడికొండ: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్ తెలిపారు. న్నారు. కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని రైతు వేదికలో రెవెన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పాల్గొని ప్రజలు, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలపై విచారణ చేపట్టి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రణయ్‌కుమార్, ఆర్‌ఐలు శివ, ఉమ, కృష్ణ, ఏఈఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

40 ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చారు.. రికార్డుల్లో నమోదు చేయడం మరిచారు

హసన్‌పర్తి: 40ఏళ్ల క్రితం పట్టా ఇచ్చి ఇప్పటివరకూ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం నమోదు చేయలేదని బాధితులు తెలిపారు. ఈమేరకు చింతగట్టులో జరిగిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రహీంకు బాధితులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతగట్టు శివారులోని 468, 469 సర్వే నంబర్లలో (బండి గట్టు మెట్టుగుట్ట) సుమారు 15 ఎకరాల భూమిని 1984 – 85లో 30మంది దళితులకు అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసినట్లు పేర్కొన్నారు. అందుకు సంబంధించిన పట్టా సర్టిఫికెట్లు అందించినట్లు ఆ పత్రంలో వివరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు నమోదు కాలేదని వారు తెలిపారు. దీంతో కొంత మంది క్వారీ నిర్వాహకులు అక్రమంగా తమ భూమిని ఆక్రమించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాధితులు నద్దునూరి నాగరాజు, దామెర వైకుంఠం, సాగర్, సదానందం, యాదగిరి, భాస్కర్, బుచ్చమ్మ, మరియమ్మ, శ్రీను పాల్గొన్నారు.

ప్రజారంజక పాలనలో పురోగతి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

వరంగల్ / వరంగల్ చౌరస్తా: ప్రధాని నరేంద్ర మోదీ ప్రజారంజక పాలనలో దేశం పురోగతి దిశగా ముందుకు సాగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ అన్నారు. వరంగల్ ఎల్‌బీనగర్ పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో 18, 19, 20, 21వ డివిజన్ల సంస్థాగత పార్టీ మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. సముద్రాల పరమేశ్వర్ మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయిలో పటిష్ట పరచాలని సూచించారు. వరంగల్ మండల ఉపాధ్యక్షుడిగా మామిడాల సతీష్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి, ఆనంద్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, జిల్లా కోకన్వీనర్ ముంద్రాతి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైరి మురళీకృష్ణ, జిల్లా కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కందుకూరి శ్రీనివాస్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోట సతీష్, మండల ప్రధాన కార్యదర్శులు బొడ్డు రాకేష్, సొల్లేటి రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు.

మార్కెట్‌లో బయోమెట్రిక్ హాజరు

వరంగల్ / వరంగల్ చౌరస్తా: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని యార్డుల్లో విధులు నిర్వర్తిస్తున్న దడవాయిలు, పారిశుద్ధ్య కార్మికులు కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్‌లో దడవాయిలు, పారిశుద్ధ్య కార్మికులు తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డి సూచించారు. కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధిగా ఉదయం 9.05 గంటల లోపు హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ గ్రేడ్ –2 కార్యదర్శులు ఎస్.రాము, జి.అంజిత్‌రావు, మార్కెట్ సిబ్బంది, దడవాయిలు పాల్గొన్నారు.

మోదీ విధానాలతోనే ఆర్థిక అసమానతలు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



న్యూశాయంపేట: కేంద్రంలోని మోదీ సర్కారు విధానాలతో సమాజంలో తీవ్ర ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్ విమర్శించారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో నాయకుడు ఉప్పలయ్య అధ్యక్షతన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో కార్మిక వర్గంపై దాడి తీవ్రమైందని వాపోయారు. దీన్ని ప్రతిఘటించేందుకు వచ్చేనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపట్టబోతున్నట్లు వివరించారు. సమ్మెను జయప్రదం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని, కార్మికులు సమ్మెలో పాల్గొనేలా ప్రచారం నిర్వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జి.ప్రభాకర్‌రెడ్డి, బి.చక్రపాణి, రవి, అశోక్, మహేష్, రజిత, ఐలయ్య, యాకయ్య, కల్పన, కళావతి, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన జీఆర్పీ పోలీసులు



ఖిలా వరంగల్: రైలుకింద పడి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడిని జీఆర్పీ పోలీసులు కాపాడి బంధువులకు అప్పగించారు. ఈ ఘటన వరంగల్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జరిగింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణు, ఆర్పీసీ అనిల్ కథనం ప్రకారం.. వరంగల్ పోచమ్మమైదానానికి చెందిన కొయ్యాడ రాజు తల్లి లేకపోవడం, తండ్రి అనారోగ్య కారణాలతో మంచం పట్టాడు. ఈక్రమంలో తనకు ఎవరూ లేరనే బాధతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్‌కు వచ్చి ఆత్మహత్యకు యత్నించగా, అక్కడే ఉన్న జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణు, ఆర్పీసీ అనిల్ గమనించి అతడిని కాపాడారు. అనంతరం అతని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఓ యువకుడి ప్రాణాలను కాపాడిన పోలీసులను జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.సురేందర్ అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఖిలా వరంగల్: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు

ఖిలా వరంగల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతోందని, ఈక్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని వరంగల్ బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ మండల పరశురాములు, స్థానిక కార్పొరేటర్ పోశాల పద్మ సూచించారు. వరంగల్ 41వ డివిజన్ శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శారదాబాయి ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సదుపాయాలు ఉన్నాయని అన్నారు. అలాగే, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ బుక్స్ ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేశారు.

కార్పొరేట్‌కు దీటుగా..

మామునూరు: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్ సూచించారు. వరంగల్ 43వ డివిజన్ మామునూరులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నరసింహారావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్ర విజయ, జన్ను సంతోష్, ఏఎస్సై లక్ష్మీనారాయణ, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కల్యాణ్, రవీందర్, సంపత్, సత్యనారాయణ రెడ్డి, విజయలక్ష్మి, రవికుమార్, సుజాత, రాజు, అనిత లత, సత్యనారాయణ పాల్గొన్నారు.

కేజీ టు టెన్త్ ఇంగ్లిష్ మీడియం

మడికొండ: మడికొండలోని ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్‌ల్లో కేజీ నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని హెచ్‌ఎంలు సంధ్యారాణి, మల్లారెడ్డి తెలిపారు. బడిబాటలో భాగంగా మడికొండలోని 46వ డివిజన్ మున్సిపల్ కార్యాలయం నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామసభ సమావేశంలో హెచ్‌ఎం సంధ్యారాణి మాట్లాడుతూ పాఠశాలలో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాసెస్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఉన్నత చదువులు చదువుకున్న ఉపాధ్యాయుల బోధనలో విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి చక్కటి అవకాశం అని అన్నారు. ఈక్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ మౌలిక వసతులకు పూర్వ విద్యార్థిగా నిధులను సమీకరించి ఉభయ పాఠశాలల ప్రగతికి కృషి చేస్తానన్నారు. సీఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, హరికృష్ణ, రాజేశ్వరి, శిరీష, సునీత, అరుణ, దూరవిద్య కోఆర్డినేటర్ సదానందం, కృష్ణమూర్తి, పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అరుణ, సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, లలిత, మంజుల, రజిత, జ్యోత్స్న, కవిత, రాజమణి, వసంత పాల్గొన్నారు.



మడికొండ: బడిబాట కరపత్రం విడుదల చేస్తున్న అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం

వరంగల్ అర్బన్: నిత్యం నగర పరిశుభ్రత, పచ్చదనం కోసం పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని నగర మేయర్ గుండు సుధారాణి కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 100 రోజుల కార్యక్రమాల్లో భాగంగా బల్దియా ఇండోర్ స్టేడియంలో పారిశుద్ధ్య, ఇతర విభాగాల కార్మికులకు శుక్రవారం మెగా వైద్య శిబిరాన్ని కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ –2047లో భాగంగా పట్టణ, స్థానిక సంస్థల్లో జూన్2 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు 100 రోజుల ప్రణాళిక అమలు చేయనున్నట్లు వివరించారు. అందులో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో రోజుకో కార్యక్రమాన్ని చేపడుతూ చర్చ, మార్పు అనే నినాదంతో ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ వినోద్, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, అడిషనల్ కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ రాజిరెడ్డి, ఎంహెచ్ఓ రాజేష్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఉద్యాన శాఖ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మేయర్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న కమిషనర్

ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో మహిళలు

వరంగల్: పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అండగా ఉంటోందని 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు 14వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సులోచన, పీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడుప మహేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు రావాలంటే అనేక నెలల సమయం పట్టేదని, కానీ, ఇప్పుడు తక్కువ సమయంలోనే చెక్కులు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారని చెప్పారు. రాజకీయాలకతీతం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పస్తం శంకర్, చిన్ని, కుమార్, స్టాలిన్, రాజేష్, శీను, ప్రభాకర్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.